సాక్షి
పల్నాడు
సోమవారం | 25 | సెప్టెంబర్ | 2023



మహంకాళి గుడికి విరాళం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కంఠంరాజు కొండూరులోని మహంకాళీ గుడికి ఆదివారం రెంటచింతలకు చెందిన భక్తులు రూ.1,05,000 విరాళం అందజేశారు.



నాగార్జునకొండలో సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు, పూణే నుంచి బౌద్ధులు తరలి వచ్చారు. సందడి చేశారు. సాగర్‌లోని అనుపు, ఎత్తిపోతల జలపాతాలను సందర్శించారు.



భక్తజన సందడి

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. క్యూలైన్లు భక్తులతో ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి.

ద్విగుణీకృతం.. దిగ్విజయం

జెడ్పీ పాలకవర్గానికి రెండేళ్లు

- చైర్‌పర్సన్‌గా హెనీక్రిస్టినా నేతృత్వంలో గణనీయ ప్రగతి సాధించిన ఉమ్మడి గుంటూరు జిల్లా
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన
- రూ.25.11 కోట్లతో 491 పనులు పూర్తి
- జగనన్న విద్యాజ్యోతి ద్వారా టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- స్టడీ అవర్లలో అల్పాహారం అందజేత



జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో హెనీక్రిస్టినా(ఫైల్)



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.61 లక్షల జెడ్పీ నిధులతో "జగనన్న విద్యాజ్యోతి" పేరుతో స్టడీ మెటీరియల్ ముద్రించి పంపిణీ చేశారు. ఈ ఏడాది కూడా పంపిణీకి చర్యలు చేపట్టారు. ఈ మెటీరియల్ గతేడాది ఉత్తీర్ణశాతం పెంపుదలకు దోహదం చేసింది.

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ పాలకవర్గం రెండేళ్ల పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. జెడ్పీ చైర్‌పర్సన్‌గా కత్తెర హెనీ క్రిస్టినా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఉమ్మడి గుంటూరు జిల్లా గణనీయమైన ప్రగతి సాధించింది. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను జెడ్పీ పాలకవర్గం పరుగులు పెట్టించింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణంతోపాటు సురక్షిత తాగునీటి సరఫరాకు విశేషంగా కృషి చేస్తోంది.

ఇవిగో పనితీరుకు నిదర్శనాలు

- జెడ్పీ పాలకవర్గం ఏర్పడిన తరువాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీటీసీ సభ్యుల సిఫార్సుల మేరకు రూ.25.11 కోట్ల జెడ్పీ నిధులతో 491 పనులను పూర్తి చేశారు.
- రూ.51 లక్షల జెడ్పీ నిధులతో టెన్త్ విద్యార్థులకు సాయంత్రం వేళ స్టడీ అవర్లలో అల్పాహారాన్ని అందజేశారు.
- జెడ్పీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు నిర్ణయించారు.
- జెడ్పీ ప్రాంగణంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.
- మన బడి నాడు-నేడు ద్వారా జెడ్పీ పాఠశాలల రూపురేఖలు మార్చారు.
- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చేసిన విజ్ఞప్తికి స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 5,388 పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



పొన్నెకల్లులో రూ.11 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న హెనీ క్రిస్టినా (ఫైల్)

15వ ఆర్థిక సంఘ నిధులతో ప్రగతికి ప్రణాళికలు

ప్రభుత్వం విడుదల చేసిన రూ.12.50 కోట్ల 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి పనులను చేపట్టేందుకు జెడ్పీ పాలకవర్గం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. జెడ్పీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ఇసుక సీనరేజీ ద్వారా రూ.12.05 కోట్లు, స్టాంప్ డ్యూటీ సర్ చార్జ్ రూ.ఆరు కోట్లు ప్రభుత్వం నుంచి హెనీ క్రిస్టినా మంజూరు చేయించుకున్నారు. దీంతోపాటు ఇంకా రావాల్సి ఉన్న రూ.60 కోట్లను విడుదల చేసేలా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి చర్యలు

కోటప్పకొండలో భక్తుల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనుల కోసం జెడ్పీ నిధులు రూ.60 లక్షలను పాలకవర్గం మంజూరు చేసింది. కారంపూడి, గోవాడ, క్వారీ ఆలయాల్లో శివరాత్రి తిరునాళ్ల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.

ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలకు ఏళ్ల తరబడి నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను ప్రభుత్వ సహకారంతో జెడ్పీ పాలకవర్గం పూర్తి చేసింది. అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించడంతోపాటు ఖాళీల భర్తీ, కారుణ్య నియామాలు చేపడుతోంది. ఈ విధంగా గత రెండేళ్లలో 63 మందికి ఉద్యోగోన్నతులు, 70 మందికి కారుణ్య నియామకాలు కల్పించింది.

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా పటిష్ట చర్యలు చేపడుతున్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చట్టపరంగా ముందుకు సాగుతున్నారు. ఇదే విషయమై గతంలో జరిగిన స్థాయీ సంఘ, సర్వసభ్య సమావేశాల్లో ఆధారాలతో సహా ప్రతిపాదనలు పెట్టి, ప్రజాప్రతినిధులతో పాటు సభ్యులందరి సమక్షంలో విస్తృతంగా చర్చించారు. జెడ్పీకి చెందిన వాణిజ్య సముదాయాలు, అతిథిగృహాల నుంచి మార్కెట్ ధరకు అనుగుణంగా అద్దెలు వసూలు చేయడంతో పాటు ఆక్రమణలకు గురైన ఖాళీ స్థలాలు స్వాధీనం చేసుకుని, వాటి నుంచి జెడ్పీకి ఆదాయ వనరులను సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రెండేళ్లలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాను. జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాం. ఆదాయాన్ని సమకూర్చుకుంటూ మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఒక్కో జెడ్పీటీసీ సభ్యుని పరిధిలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు నూరు శాతం రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని నిర్ణయించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం అద్భుతం. స్వచ్ఛగ్రామాల రూపకల్పనకు నడుంబిగించాం. జెడ్పీ ఉద్యోగులకు నివాస గృహ సముదాయాన్ని నిర్మించదలిచాం. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలకవర్గ సభ్యులందరం సమష్టి కృషితో ముందుకు సాగుతున్నాం.

– కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీ చైర్‌పర్సన్

న్యూస్‌రీల్

గణేష్ లడ్డూ @ రూ.5.30 లక్షలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సెంటర్‌లో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ముందుగా పదివేల మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. నిమజ్జనానికి ముందు తాడేపల్లికి చెందిన బంతు లక్ష్మారెడ్డి మనవడు ఋషి కొరెడ్డి ఇచ్చిన 36 కేజీల లడ్డూకు వేలంపాట నిర్వహించారు. ఈ లడ్డూను తాడేపల్లికి చెందిన కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, గరుగు శ్రీనివాసరెడ్డి స్నేహితులు రూ.5.30 లక్షలకు పాడుకున్నారు. అనంతరం విగ్రహ దాతలకు సన్మానం చేశారు. నిమజ్జనోత్సవంలో కోయ నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 పోటీలు నిర్వహిస్తామని నిర్వహణ కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న అండర్-17 బాలబాలికల టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను పేరేచర్లలోని ఇంటెల్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 27న అండర్-14, 17 బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీలను బాపట్లలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ స్కూల్లోనూ, 29న అండర్-14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలను పొన్నెకల్లులోని జెడ్పీహెచ్ స్కూల్లోనూ జరపనున్నట్టు వివరించారు.

అమరుల త్యాగాలు స్మరించుకోవాలి



మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అమరవీరులను స్మరించుకోవాలని, వారి త్యాగాలు మరువలేనివని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి భారతి ప్రవీణ్‌పవార్ అన్నారు. నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా మూలపాడు వీరాంజనేయకాలనీలో ఆమె ఆదివారం సాయంత్రం పర్యటించారు. భరతమాత చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్థానిక అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సిద్ధం చేసిన మట్టిని బిందెలో స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి సేకరిస్తున్న మట్టిని ఢిల్లీలో నిర్మిస్తున్న అమరవీరుల స్మారక స్థూపంలో వినియోగిస్తామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, జిల్లా ఇన్‌చార్జి నరసింహారావు, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యేశ్వరుడికి బంగారు, వెండి వస్తువుల సమర్పణ






మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన కడియాల బాలశేఖర్, శ్రీలక్ష్మి దంపతులు బంగారు, వెండి వస్తువులను ఆదివారం సమర్పించుకున్నారు. ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం రూ.4.87 లక్షల విలువైన రెండు బంగారు సాలహారాలు, రూ.48,500 విలువైన రెండు వెండి ప్లేట్లు ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావుకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 524.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 853.30 అడుగుల వద్ద ఉంది.

• నమఃసుమాలు



గుంటూరు నగరంలోని కేవీపీ కాలనీ 1/10లో 21వ డివిజన్ కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం బెంగళూరు నుంచి తెప్పించిన 20 రకాల ప్రత్యేకమైన పూలతో గణనాథుడిని సుమనోహరంగా అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో గణపతిని దర్శించుకుని నమస్సులు అర్పించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది.

– నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్)

ఐఎంఏ జిల్లా కార్యవర్గ కొత్త కమిటీ

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ నూతక్కి శ్రీనివాస్, కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని ఐఎంఏ హాలులో శనివారం రాత్రి జరిగిన ఐఎంఏ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ బి.సాయి కృష్ణ ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు పలువురు ఐఎంఏ సీనియర్ నాయకులు, పలువురు సభ్యులు, పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు. ఐఎంఏ బలోపేతం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, నరేంద్రరెడ్డి తెలిపారు. వైద్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను గుంటూరు వైద్యులకు పరిచయం చేసేందుకు ప్రత్యేక సీఎంఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



ఎన్నికైన ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నరేంద్రరెడ్డి తదితరులు

మహ్మద్ ప్రవక్త సూక్తులు ఆచరణీయం

డెప్యూటీ సీఎం అంజాద్ బాషా

పాత గుంటూరు: మహ్మద్ ప్రవక్త జన్మదినం సర్వ మానవాళికి శుభదినమని ఆంధ్రప్రదేశ్ డెప్యూటీ సీఎం షేక్ అంజాద్ బాషా పేర్కొన్నారు. గుంటూరులో సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ మొహియుద్దీన్ బాద్షా సర్కారు దర్బార్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే మిలాద్ ఉన్ నబీ వేడుకల పోస్టర్‌ను ఆదివారం విజయవాడలోని డెప్యూటీ సీఎం కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. నిర్వాహకులు తొలుత ఆయనను ఇస్లాం సంప్రదాయం ప్రకారం సత్కరించారు. ప్రత్యేక దువా నిర్వహించారు. అంజాద్ బాషా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సూక్తులు ఆచరణీయమన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఈనెల 28న గుంటురులో నిర్వహించే భారీ ర్యాలీని అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మొహమ్మద్ బాబు ఖాన్ ఖాద్రి, షేక్ ఖాసీం ఖాద్రి, కరిముల్లా, మల్లిక్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

దయాలసిస్

- కిడ్నీ రోగులకు పునర్జన్మ
- నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో 11 అత్యాధునిక యంత్రాలు
- రోజూ 28 మంది రోగులకు డయాలసిస్
- వేల రూపాయల విలువైన వైద్యం ఉచితంగా..
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక చొరవతో దిగ్విజయంగా నిర్వహణ



ఈనెల 6న హాస్పిటల్‌లోని యూనిట్‌కు డయాలసిస్ యంత్రాన్ని బహుమతిగా అందజేసి స్విచ్ఆన్‌చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ సాగిరెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి, రోటరీ సంస్థ ప్రతినిధులు(ఫైల్)

నరసరావుపేట: నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో అపోలో-రోటరీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాలసిస్ యూనిట్ కిడ్నీ రోగులకు పునర్జన్మ ఇస్తోంది. ప్రభుత్వ సౌజన్యంతో అపోలో డయాలసిస్ క్లినికల్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యూనిట్‌కు రోటరీక్లబ్ తన వంతు సహకారం అందజేస్తోంది. జిల్లాలో నరసరావుపేట, మాచర్ల ఏరియా హాస్పిటళ్లలో డయాలసిస్ యూనిట్లు నడుస్తున్నాయి. నరసరావుపేటలో రోజుకు మూడు షిఫ్టులుగా 11 డయాలసిస్ యంత్రాలు సేవలందిస్తున్నాయి. ప్రతిరోజూ పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే 28 మంది రోగులకు డయాలసిస్ జరుగుతోంది. ప్రభుత్వంతోపాటు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషి వల్ల దాతలు రూ.లక్షలు విలువ చేసే యంత్రాలను ఉచితంగా అందజేసి వందలాది మంది రోగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

ఐదు యంత్రాలు అందించిన ఎన్ఆర్ఐ

ప్రతి కిడ్నీ రోగి వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాలి. ఒక రోగికి డయాలసిస్ చేసేందుకు నాలుగు గంటల సమయం పడుతుంది. దీనిని బట్టి 11 యంత్రాల ద్వారా రోజుకు 28 మందికి సేవలందుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచనతో నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, ఇంటర్నేషనల్ రోటరీ క్లబ్ సభ్యుడైన నెఫ్రాలజిస్టు డాక్టర్ సాగిరెడ్డి పురుషోత్తమ బాబురెడ్డి ఒక్కొక్కటి రూ.6.50 లక్షలు ఖర్చయ్యే ఐదు యంత్రాలను డయాలసిస్ యూనిట్‌కు ఉచితంగా అందజేశారు. ప్రైవేటుగా అయితే డయాలసిస్‌కు రోజుకు రూ.2 వేలు ఖర్చవుతుంది. దీనిని ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా చేయడంతోపాటు రూ.3 వేల విలువైన ఇంజక్షన్లను ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా అందిస్తోంది. దీంతోపాటు మందులనూ ఉచితంగా అందజేస్తున్నారు. హెచ్ఐవీ (పాజిటివ్) రోగులకు ప్రత్యేకంగా నాలుగు యంత్రాలు కేటాయించారు. మిగిలిన వారికి మిగతా యంత్రాలు వాడుతున్నారు. 24 గంటలూ ఈ యూనిట్ పనిచేస్తుండడం గమనార్హం.



స్థానిక ఏరియా హాస్పిటల్‌లోని యూనిట్‌లో డయాలసిస్ పొందుతున్న రోగులు

మాకు దేవుడిచ్చిన వరం



డయాలసిస్ చేయటమంటే రోగులకు పునర్జన్మ ఇవ్వడమే. ఈ యూనిట్‌లో సేవ చేయడం మాకు దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాం. అపోలో ద్వారా మొత్తం 11 మంది ఉద్యోగులం ఇక్కడ పనిచేస్తున్నాం. రోగుల అవసరార్థం ఆర్వో ప్లాంట్ కూడా ఏర్పాటు చేశాం. రోగులను సోదరులుగా భావిస్తూ వైద్యసేవలు అందజేస్తున్నాం.

– పి.శ్రీనివాసరెడ్డి, హెడ్ ఆఫ్ ది డయాలసిస్ యూనిట్, నరసరావుపేట

'వందేభారత్' గొప్ప ముందడుగు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

తెనాలి: ఒకేసారి తొమ్మిది వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించడం గొప్ప ముందడుగని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అభివర్ణించారు. విజయవాడ-చెన్నై రైలు మార్గంలో కొత్తగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం మధ్యాహ్నం తెనాలి చేరుకున్న సందర్భంగా ఘన స్వాగతం పలికారు. తెనాలి రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ టి.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ వందేభారత్ రైలుకు తెనాలి రైల్వే జంక్షన్‌లో హాల్ట్ ఇవ్వటం, తెనాలి బిడ్డగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ అత్యాధునిక రైళ్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.

సాంస్కృతిక సంబరాలతో ఘనస్వాగతం

సభానంతరం తెనాలి చేరుకున్న వందేభారత్ రైలుకు ఘనస్వాగతం లభించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా తొమ్మిది వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించగా, వీటిలో విజయవాడ-చెన్నై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌కు తెనాలి జంక్షన్‌లో హాల్ట్ ఇచ్చారు. తొలిరోజున వచ్చిన రైలుకు రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రయాణికులు ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తెనాలి ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకు చేరుకున్న రైలును ప్రజాప్రతినిధులు సందర్శించి సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఐదు నిముషాల తర్వాత ఇక్కడి నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పచ్చజెండా ఊపి వీడ్కోలు పలికారు. ముందుగా ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై 11.40 గంటల నుంచి స్వాగత సంబరాలను నిర్వహించారు. డిజిటల్ స్క్రీన్‌పై ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగిన వందేభారత్ ప్రారంభోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. చక్రాయపాలెంకు చెందిన ఆర్.జగన్‌మోహన్‌రావు, శివపార్వతి, లక్ష్మి బృందం కోలాట ప్రదర్శన ఇచ్చింది. బుద్ధయోగా హెల్త్ ఫౌండేషన్ యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ నేత యడ్లపాటి స్వరూపారాణి పాల్గొన్నారు.



వందేభారత్ రైలుకు పచ్చజెండా చూపుతున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

క్లుప్తంగా

ఒడిశా కార్మికుడు అనుమానాస్పద మృతి

మార్టూరు: కార్మికుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసుల అందించిన వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రామచంద్ర మహాపాత్రో(34) గత కొన్నేళ్లుగాగా స్థానిక అమరావతి నూలు మిల్లులో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా మిల్లులో పనికి రాలేదు. క్వార్టర్స్‌లో కూడా కనిపించకపోవడంతో రామచంద్ర మహాపాత్రో తోటి కార్మికులు ఆదివారం నూలుమిల్లు పరిసరాలను గాలించారు. అందులో భాగంగా మిల్లు వెనుక వైపు ఉన్న చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ ఫిరోజ్, ఎస్‌ఐ కే కమలాకర్ పరిశీలించారు.

పెదనందిపాడులో 30.8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనంతో గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా పెదనందిపాడు మండలంలో 30.8 మి.మీ., అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 0.6 మి.మీ. పడింది. సగటున 7.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదకాకాని మండలంలో 25.2 మి.మీ., దుగ్గిరాల 22.8, తాడికొండ 22.4, గుంటూరు తూర్పు 10.2, గుంటూరు పశ్చిమ 10, కాకుమాను 5.4, వట్టిచెరుకూరు 3.8, తుళ్లూరు 1.2 మి.మీ. నమోదైంది.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం


చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి అంబటి రాంబాబు

- ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆర్థిక భరోసా
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఐదుగురు లబ్ధిదారులకు రూ.8.45 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

సత్తెనపల్లి: పేద ప్రజల సంక్షేమానికి, అనారోగ్యాలతో ఆర్థికంగా చితికిపోయిన వారికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఐదుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.8.45 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరి సంక్షేమం కోసం పారదర్శకంగా పనిచేస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ సాయం అందుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఈ ప్రభుత్వం ఆచరణాత్మక, సంస్కరణతో కూడిన పాలనను అందిస్తోందని వివరించారు. విలేజ్ క్లినిక్, కుటుంబ వైద్యుని విధానంతో ఇంటింటికి వైద్యులు వెళ్లి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. పేద ప్రజలకు, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, నకరికల్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ నాయకుడు 'కొరటాల'

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- కొరటాల శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

తాడేపల్లి రూరల్ : ప్రజా సమస్యల్ని నిరంతం అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోసం కృషి చేసిన ఆదర్శ నాయకుడు కొరటాల సత్యనారాయణ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఆదివారం కొరటాల సత్యనారాయణ, గుంటూరు బాపనయ్య భవన్‌లో కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 1923, సెప్టెంబర్ 24న అమృతలూరులో జన్మించిన కొరటాల విద్యార్థి దశ నుంచే అనేక సమ్మెల్లో పాల్గొన్నారని చెప్పారు. నిర్బంధాలు, ఆటుపోట్లను ఎదుర్కొని సీపీఎం రాష్ట్ర నాయకుడిగా, ఆదర్శ కమ్యూనిస్టుగా చివరి వరకు పోరాటాలు నడిపారని వివరించారు. ఆయన జీవితం ఆదర్శప్రాయమని తెలిపారు. కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల్ని ఏడాది పాటు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కార్యదర్శి హరిబాబు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి, నాయకులు వై.కేశవ రావు, వి.వెంకటేశర్లు, మాల్యాద్రి, కె.ఉమామహేశ్వరరావు, జి. రామన్న, వై. రాధాకృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కె.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్

ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్సీ జంగా, ఎమ్మెల్యే గోపిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట: రాష్ట్రంలో బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సదస్సు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు సమాజానికి వెన్నెముఖగా సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారని చెప్పారు. ఈ మేరకు బీసీల్లో నాయకత్వం ఎదగాలని కోరారు. మరో ఆర్నెల్లులో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తున్న తరుణంలో ప్రతి గ్రామం, వార్డు నుంచి బీసీ నాయకులు కమిటీలుగా ఏర్పడాల్సిన అవసరం ఉందని కోరారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ బీసీ భవన్ నిర్మాణం చేపట్టామని ఇప్పటికే 18 సెంట్ల స్థలం కేటాయించినట్లు వెల్లడించారు. భవన నిర్మాణం కోసం పురపాలక సంఘం నుంచి రూ.50 లక్షలు, విరాళాల ద్వారా మరో రూ.75 లక్షలు సమకూర్చినట్లు పేర్కొన్నారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలో బీసీ మండల్ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బీసీ గర్జన ద్వారా వారి ప్రాధాన్యం తెలియచేసేందుకు త్వరలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో బాపట్ల, ప్రకాశం, పల్నాడు రీజినల్ కో ఆర్డినేటర్ పోట్ల రామారావు, పల్నాడు జిల్లా బీసీ అధ్యయన కమిటీ అధ్యక్షుడు సాపర్ల శ్రీనివాసరావు, ముదిరాజు కార్పొరేష్ డైరెక్టర్ ఈఎం.స్వామి, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, తోట వీరయ్య, బత్తుల వెంకట్, బి.రామకృష్ణరాజు పాల్గొన్నారు.

బైక్.. లారీ ఢీకొని వ్యక్తి మృతి



చెరుకుపల్లి: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గూడవల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. మేరకు గూడవల్లి లైబ్రరీ సమీపంలో అదే గ్రామానికి చెందిన లింగమనేని వెంకటేశ్వరరావు(70) జాతీయ రహదారిపై గ్రామ సమీపంలోని గంగాయి చానల్ వైపు వెళుతుండగా చెరుకుపల్లి వైపు నుంచి భట్టిప్రోలు వైపు వెళుతున్న మిక్సర్ టిప్పర్ వెనుకగా ఢీకొనటంతో వెంకటేశ్వరరావు మృతి చెందాడు. మృతుడికి కుమారుడు కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వై.సురేష్ పరిశీలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

పద్య కవితలో నిలువెత్తు శిఖరం జాషువా


వివిధ రంగాల్లో పురస్కారాలను పొందిన వారిని సన్మానిస్తున్న కార్డ్స్ సంస్థ ప్రతినిధులు

పిడుగురాళ్ల: భారత దేశ కవిత రంగంలో నిలువెత్తు శిఖరం మహాకవి జాషువా అని, దళిత జాతుల తన కవితరంగంలో గొప్ప వ్యక్తిని రిటైర్డ్ జడ్జి కూచిపూడి ప్రసాదరావు అన్నారు. లెనిన్‌నగర్‌లో ఉన్న కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాషువా రచనలో జాషువా భావాల్లో కార్డ్స్ సంస్థ విస్తృతంగా ప్రచారం చేయటం గొప్ప విషయమని కార్డ్ సంస్థ అభినందనీయమని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన వ్యక్తులను జాషువా 2023 పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి మాజీ ఏజీపీ ఎ.రూత్ బనియన్ అధ్యక్షత వహించారు. కవితా రంగంలో కవి అనిల్‌కుమార్, విద్యా రంగంలో ఉత్తమ ఉపాధ్యాయురాలు తెల్ల నిర్మలకుమారి, దుర్గి మండలం చెందిన కందుకూరి మారత్మ్మ, ఉత్తమ సోషల్ వర్కర్ పి.నరసింహారావు, ఫార్మర్ రంగంలో చింతల అన్నారావుకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కవి వి.అనిల్‌కుమార్, తాళ్లూరి అమర్నాథ్, కార్డ్స్ స్కూల్ ఇన్‌చార్జి పి.లత, జాషువా కళా సమితి అధ్యక్షులు చల్లగుండ్ల సంతోషరావు, రాజుపాలెం మాజీ ఎంపీపీ వర్ల శ్రీను, బాలబాట ఏసీవో గారపాటి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఎస్‌కే అబ్దుల్ రహీం, పి.దయామని, సునీత పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యడ్లపాడు: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన యడ్లపాడు మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కారు డ్రైవర్ తెలిపిన వివరాలు.. నూజివీడు సమీపంలోని విసన్నపేట నుంచి పల్నాడు జిల్లా వినుకొండలో కొందరు ప్రయాణికుల్ని దింపి తిరిగి వస్తున్న క్రమంలో రాత్రి 8 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారి అండర్‌పాస్ వంతెన ఎక్కే సమయంలో కారు వెనుక భాగం నుంచి పొగలు, మంటలు రావడాన్ని డ్రైవర్ గమనించి వెంటనే వాహనాన్ని డివైడర్ పక్కన ఆపి కిందకు దిగాడు. వెంటనే ఒక్కసారిగా కారు మొత్తం మంటలు వ్యాపించాయి. నీటి కోసం డ్రైవర్ చుట్టూ పక్కలా పరుగులు తీసినా దొరకలేదు. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. చిలకలూరిపేట అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. తీవ్రస్థాయిలో మంటలు చెలరేగడంతో అప్పటికే కారు పూర్తిస్థాయిలో కాలిపోయింది. కారును ఇటీవలే కొనుగోలు చేశారని, వైరింగ్ షార్ట్ అయి ప్రమాదం జరిగి ఉంటుందని అగ్రిమాపక శాఖ అధికారులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


విజయ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నాగశివారెడ్డి

మేదరమెట్ల: ఆర్థిక ఇబ్బందులు, కుమారుడికి అనారోగ్యం మరో పక్కన ఈ రెండింటితో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామం దాసరిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. గ్రామంలోని దాసరిపాలేనికి చెందిన పూరిమిట్ల విజయ్(30) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆరేళ్ల కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. దీంతో తండ్రి విజయ్ హైదరాబాద్‌లో కుమారుడికి వైద్యం చేయించుకుంటూ అక్కడే కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమారుడి వైద్యం కోసం ఎంత డబ్బు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన విజయ్ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. విజయ్ నివాసం ఉంటున్న ఇంటికి కొద్ది దూరంలో ఉన్న మరో ఇంట్లో శనివారం రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించి చూడగా విజయ్ ఉరివేసుకొని కనిపించాడు. మేదరమెట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగశివారెడ్డి పరిశీలించారు.

సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన బైక్..


గాయాలపాలైన బాలకోటయ్యను తీసుకువస్తున్న రైతులు


క్షతగాత్రుడు జక్రయ్యను మోసుకోస్తున్న రైతులు

బల్లికురవ: బైకు అదుపుతప్పి ఏబీసీ కాలువలో పడి ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం బల్లికురవ- అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఏబీసీ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన చాట్ల బాలకోటయ్య, చాట్ల జక్రయ్య బైకుపై బల్లికురవ వస్తున్నారు. ఏబీసీ కాలువ వద్ద వంతెనకు వద్దకు రాగానే అదుపు తప్పి బ్రిడ్జిపై నుంచి సుమారు 15 అడుగుల లోతుతో ఉన్న కాలువలోకి బైక్‌తో సహా పడ్డారు. కాలువలో నీటి ప్రవాహం లేకపోవటం వలన ఇద్దరు గాయపడ్డారు. సమీపంలోని పొలాల్లోని రైతులు కాలువలో పడ్డారని గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. మార్టూరు నుంచి వచ్చిన 108 స్ట్రెక్చర్ సహాయంతో రైతులే కాలువలోకి దిగి క్షతగాత్రులను కాలువలో నుంచి ఒడ్డుకు మోసుకువచ్చి 108 వాహనంలోకి ఎక్కించారు. ఈఎంటీ నాగేశ్వరమ్మ, పైలట్ శాయి ప్రతాప్ రెడ్డి, ఇద్దరికి ప్రాథమిక చికిత్స చేశారు. బాలకోటయ్యకు తొంటి, జక్రయ్యకు చేతులు విరిగాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏబీసీ కాలువ వద్ద బ్రిడ్జి శిథిలావస్థకు చేరటం ఇరువైపులా యాంగ్లర్లు లేనందున తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు బ్రిడ్జి ఇరువైపుల యాంగ్లర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు చెక్ పెట్టాలని వేడుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌లో విద్యార్థి ప్రతిభ


రాష్ట్రస్థాయి అథ్లెటిక్‌లో సిల్వర్ సాధించిన శామ్యూల్ టైమ్స్

బాపట్ల అర్బన్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో వంద మీటర్ల పరుగుపందెంలో బాపట్లకు చెందిన శామ్యూల్‌టైమ్స్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. బాపట్ల డీఎంపల్లికి చెందిన శామ్యూల్‌టైమ్స్ గుంటూరులోని హిందూ కాలేజీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థిని కోచ్ రవి అభినందించారు.

జాషువా 'క్రీస్తు చరిత్ర' కావ్యం అపురూపం


స్వర్ణలతను సత్కరిస్తున్న మాణిక్యవరప్రసాద్ తదితరులు

పాత గుంటూరు: మహాకవి జాషువా కళా పీఠం వ్యవస్థాపకులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జాషువా జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం కన్నవారి తోటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జాషువా రచించిన ఖండ కావ్యం 'క్రీస్తు చరిత్ర' పై వ్యాఖ్యానం, విశ్లేషణ నిర్వహించారు. సభకు విశ్రాంత డీఐజీ శావల బాలస్వామి అధ్యక్షత వహించారు. కార్డ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ యం. స్వర్ణలత ముఖ్య వక్తగా పాల్గొని క్రీస్తు చరిత్ర కావ్యంపై వ్యాఖ్యానం, విశ్లేషణ చేశారు. జాషువా క్రీస్తు చరిత్ర కావ్యం అపురూపమని తెలిపారు. అనంతరం స్వర్ణలతను సత్కరించారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి కమిటీ చైర్మన్ పినపాటి నానారావు, ఫాదర్ గాబ్రియేల్, హైకోర్టు న్యాయవాది గద్దం ఎలీషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అత్తోట జోసెఫ్ కుమార్, జాషువా కళాపీఠం కార్యదర్శి నూతక్కి సతీష్ పాల్గొన్నారు. క్రీస్తు చరిత్ర కావ్యంలోని పద్యాలను చంద్రపాల్, బాబూరావు ఆలపించారు. జాషువా అభిమానులు, మాదిగ జనసేవా సమితి సభ్యులు, తెలుగు బాప్టిస్ట్ చర్చి సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక నేరాల నిర్ధారణపై పీజీలకు సీఎంఈ


మాట్లాడుతున్న డాక్టర్ టీటీకే రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు వైద్య కళాశాలలో 'లైంగిక నేరాలు- ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై పీజీ వైద్య విద్యార్థులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్య విభాగాధిపతి డాక్టర్ టీటీకే రెడ్డి మాట్లాడారు. లైంగిక దాడిలో జరిగిన నేరాన్ని శాస్త్రీయంగా నిరూపించే విషయాలపై పీజీ వైద్యులు అప్రమత్తంగా ఉండి మెళుకువలు నేర్చుకోవాలని సూచించారు. ఒక పక్క బాధితులకు వైద్యసేవలు అందిస్తూనే, మరోపక్క మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి నేరాన్ని ఏ విధంగా ఏఏ పరీక్షల ద్వారా నిరూపించాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, పోక్సో యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్, సీఎంఈ పరిశీలకులు డాక్టర్ సీతారామ, కో- ఆర్డినేటర్ డాక్టర్ బాబు, విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, మార్కాపురం, మచిలీపట్నం, ఇబ్రహీంపట్నానికి చెందిన వైద్య కళాశాలల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినుల రక్తదానం


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: నేషనల్ స్టూడెంట్స్ సర్వీసెస్ (ఎన్ఎస్ఎస్) డే సందర్భంగా ఆదివారం గుంటూరు వైద్య కళాశాల వైద్య విద్యార్థినులు రక్తదానం చేశారు. స్థానిక ఆకులవారితోటలోని మెడికల్ కాలేజీ బాలికల వసతి గృహంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భవ- సేవా పక్వాడా అనే కార్యక్రమం ద్వారా రక్తదానం ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. డోనేట్ బ్లడ్- సేవ్ లైఫ్ అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వైద్య విద్యార్థినుల్ని అభినందించి వారికి ప్రశంసా పత్రాల్ని డాక్టర్ శ్రావణ్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బి. లక్ష్మానాయక్, లంకపల్లి మధుసూధనరావు, జ్యోతుల వీరాస్వామి, శ్రీనివాసరావు, శ్రీవిద్య, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు 'చలో అసెంబ్లీ'కి అనుమతుల్లేవు: జిల్లా ఎస్పీ

నగరంపాలెం: సోమవారం తలపెట్టిన 'చలో అసెంబ్లీ'కి ఎటువంటి అనుమతుల్లేవని గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావద్దని ఆయన సూచించారు. ఎవరైనా పోలీస్ ఆదేశాల్ని ధిక్కరించి, కార్యక్రమంలో పాల్గొన్నట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.